ఈ వారం కథ

# నేనూ అమ్మనే

- ఆదెళ్ళ శివకుమార్

కన్నపిల్లలు సుఖంగా, ఆనందంగా వుండాలన్న స్వార్థం తప్పితే తనకంటూ ఏమీ కోరుకోని, మిగుల్చుకోని అమృత హృదయం పేరే 'అమ్మ'

'అమ్మ'ను వివరంగా నిర్వచించమని స్కూల్లో ఓ పోటీ పెడితే మా అమ్మాయి రాసిన ఈ నిర్వచనానికి మొదటి బహుమతి వచ్చింది. ఆ రోజు దాని సంబరం ఏమని చెప్పాలి?

తను ఏ డ్రెస్ వేసుకోవాలి? అన్న సంగతి ఆలోచించడం మానేసి బీరువాలోని నా చీరలన్నీ కుప్పపోసింది. ఏ చీర కట్టినా దానికి నచ్చలేదు. దాని సరదా కాదనలేక ఓపికగా కట్టమన్న చీరల్లా కట్టుకున్నాను. మొత్తానికి ఓ రెండు గంటల తర్వాత 'ఈ చీర నీకు బాగా నప్పిందమ్మా!' అంటూ సంతృప్తిని వ్యక్తం చేసింది. ఆ చీర కట్టుకున్న నన్ను నాలుగు ప్రక్కల చూసుకుని మురిసిపోయింది. తన చేతులతో స్నో రాసి, పౌడర్ అద్ది, తిలకం దిద్దింది.

యధాప్రకారం శ్రీవారు తనకు రావడం కుదరదని అనడంతో మేమిద్దరమే ఫంక్షన్‌కు బయల్దేరాం. వక్తల ప్రసంగాలవీ అయ్యాక బహుమతి ప్రదానం ఆరంభమైంది. 'గీతాంజలి' అని మా అమ్మాయి పేరు పిలవగానే హర్షధ్వానాల మధ్య మా అమ్మాయి ఎంతో రీవిగా, రాజసంగా నడుచుకుంటూ వెళ్ళింది. కలెక్టర్ బహుమతి ఇచ్చారు. ఆ తర్వాత మైక్ చేతిలోకి తీసుకుని ఈ అవార్డు మా అమ్మకే చెందాలని, తను రాసిన దానికి నిర్వచనం మా 'అమ్మ' అని గీతాంజలి చెప్తూంటే వాళ్ళ అభ్యర్థన మేరకు నేను కూడా స్టేజీ మీదకు వెళ్ళాల్సి వచ్చింది.

ఇలాంటి కూతుర్ని కన్న మీరు అదృష్టవంతులు అని పొగుడుతూంటే ఈ హృదయంలో ఆనందం అంబరమే అయ్యేది.

ఇల్లు సర్దుతూంటే మొమెంటో తుడుస్తున్న మనసు జ్ఞాపకాలను తట్టిలేపింది.

కాని ఇప్పుడేది ఆ పిలుపు?

అమ్మా... అమ్మా... అంటూ నా వెంట తిరిగే నా చిన్నారి తల్లి ఏది?

వెళ్ళి చూసి అప్పుడే సంవత్సరం దాటిపోయింది.

ఎక్కడుందో తెలుసు. వెళ్ళలేను.

ఏం చేస్తోందో తెలుసు! ప్రోత్సహించలేను.

అదేం తింటుందో? ఎలా బతుకుతోందో? ఏం ఆర్థిక ఇబ్బందులు పడుతోందో అన్న దిగులు గుండెల నిండా పేరుకుని ఒక్కోసారి... ఒక్కోరోజు అస్సలు గడవదు. ఇక ఆ రోజు సుదీర్ఘం అవుతుంది.

ఏ పని చేస్తున్నా ఎక్కడున్నావే అమ్మా! అని గీతాంజలి పిలుస్తున్నట్టే ఉంటుంది.

కళ్ళు అప్రయత్నంగా చెమర్చాయి.

ఇంతకీ నా కూతురు చేసింది తప్పా? ఒప్పా? తేల్చుకోలేని సందిగ్ధం...

★ ★ ★

పెద్దమ్మాయికి పెళ్ళయ్యాక గీతాంజలికి సంబంధాలు చూడటం ఆరంభించాం. దాని పెళ్ళి నాకో పెద్ద సమస్య అయిపోయింది. ఎందుకంటే అది చాలా సున్నిత మనస్కురాలు. త్వరపడి తాను ఓ మాట ఎవర్నీ అనదు. ఎవరైనా అంటే తట్టుకోలేదు. పెళ్ళీడు వచ్చినా దానిలో పసితనం, అమాయకత్వం పోలేదు. పూవు రాలినా, ఆకు పండినా బాధపడే భావకురాలు.

ఇదిలా ఉండగా గీతాంజలి ప్రేమలో పడిందని తెల్సింది.

అతడి పేరు శంకర్.

ఎవరా అని ఆరాతీస్తే ఒకరేమో అతను గూండా అన్నారు. మరొకరు అతను ఆరుగుర్ని చంపేశాడు, కోర్టులో కేసులు నడుస్తున్నాయి అన్నారు. ఒకరేమో అతనికి ఆల్రెడీ పెళ్ళైపోయింది అన్నారు. ఒక్కరంటే ఒక్కరు కూడా ఆ శంకర్ గురించి ఓ మంచి మాట చెప్పినవారు లేరు. పెళ్ళన్నాక అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు జాతకాలు చూడకపోయినా కనీసం అతగాడి స్వభావం, కుటుంబం గురించి అయినా తెల్సుకోవాలిగా!

దీనికి తోడు కులాంతరం...

ఎలా సమర్థించేది?

చూస్తూ చూస్తూ కన్నకూతురి గొంతు కోయలేం కదా!


కానీ గీతాంజలి వినలేదు.

అతని వెంట వెళ్ళిపోయింది.

వాళ్ళ పెళ్ళైన విషయం తెల్సినా మేం చూడటానికి వెళ్ళలేదు. దాని రాతలో ఎలా ఉంటే అలా జరుగుతుందని సరిపెట్టుకున్నాం. ఎంత భగవంతుడి మీద భారం వేసినా మనసులో పేరుకున్న దిగులు, ఆందోళనలను ఏం చేయాలి?

ఈ రోజు ఎందుకో అమ్మాయి మరీ గుర్తుకు వస్తోంది. అది తల్లి కాబోతోందని గీతాంజలి ఫ్రెండ్ ఫోన్ చేసి చెప్పింది.

అప్పటి నుంచి ఈ తల్లి మనసు అస్సలు నిలవడంలేదు.



'అమ్మాయ్! పిల్లి పిల్ల తిరుగుతోందే! పాలు ఉట్టిమీద పెట్టు' అని అత్తగారు పిలవడంతో లేచి ఆ పని చేశాను.

పిల్లి తన పిల్లలను ఏడు ఇళ్ళు తిప్పుతుందంటారు. అలా పట్టుకు వెడుతుండగా ఎవరో అదిలించడంతో ఓ పిల్లను ఇక్కడ వదిలేసిందో లేదా ఈ కూనే వాళ్ళ నుంచి తప్పిపోయిందో కాని అటూ ఇటూ తిరుగుతూ తెగ అరవసాగింది. తల్లి కన్పించక ఆ కూన పడే అవస్థ వర్ణనాతీతం. పాలు తాగుతుందేమోనని దాని దగ్గర పెట్టాను. ఊహు అదింకా కళ్ళు పూర్తిగా తెరవని పసిగుడ్డు. అదలా వెతుక్కుంటూ వెళ్ళిందో లేదో దాని తల్లి 'మ్యావ్... మ్యావ్' అంటూ వచ్చింది. ఆ విధంగా రెండు మూడుసార్లు జరిగింది. ఇక లాభం లేదని పిల్లి పిల్ల గదిలోకి రాగానే పోవడానికి వీల్లేకుండా తలుపేశాను. కొంతసేపటికి తల్లి పిల్లి కూడా వచ్చింది. అప్పుడు తలుపు తీశాను. ఇక ఆ పిల్లల ఆనందం ఏమని వర్ణించను?

తన పిల్ల తప్పిపోతే ఎక్కడో అక్కడ ఆనందంగా ఉంటుంది లెమ్మనో లేక దాని రాతలో ఎలా ఉంటే

అలా జరుగుతుందనో తల్లి పిల్లి అనుకోవచ్చుగా! కాని పిల్ల కనిపించేదాకా దాని తల్లి మనసు ఎంత ఆరాటపడిందో? దానికున్న పాటి ప్రేమ నా కూతురి మీద నాకు లేకపోయింది. ఇంతకు గీతాంజలి చేసిన తప్పేంటి?

తన అభిరుచులకు తగిన వ్యక్తిని జీవిత భాగస్వామిగా ఎన్నుకుంది. అతను మంచివాడు కాదు. అని అంత చెప్పున్నప్పుడు వాళ్ళ ఊరెళ్ళి వాకబు చేయడం లాంటివేవీ చేయకుండా వారిద్దరినీ విడదీయాలని మేం ప్రయత్నించబట్టేగా గీతాంజలి అలాంటి నిర్ణయం తీసుకుంది.

అసలు తల్లిదండ్రులుగా మేమేమైనా బాధ్యతాయుతంగా ప్రవర్తించామా? కనీసం పెళ్ళయిందని తెలిసాకైనా వాళ్ళ పెద్దవాళ్ళతో మాట్లాడటమో లేక పిల్లలెలా బతుకుతున్నారనో వాకబు చేశామా? అంటే లేదు... ఎందుకు అది మా మాట వినలేదు కాబట్టి... దాని ఖర్మ అది అనుభవిస్తుందని వదిలేశాం.

ప్రేమ అంటే అన్‌కండిషనల్‌గా ఉండాలి. ముఖ్యంగా అవతలి వ్యక్తి ప్రవర్తనతో మన ప్రేమలో మార్పు రాకూడదు. మా మాట వింటేనే పిల్లల్ని ప్రేమిస్తాం. వారి గురించి ఆలోచిస్తాం లేదంటే వాళ్ళను గూర్చి తెల్సుకోం అని తల్లిదండ్రులు అనుకోకూడదు.



అంతే! ఈ నిర్ణయం తీసుకున్న రెండో రోజు గీతాంజలి ఇంటి తలుపు తట్టాం. మా అమ్మాయి మమ్మల్ని చూసి ఆశ్చర్యపోయింది. అల్లుడు సాదరంగా ఆహ్వానించాడు.

మీరు ఆనాడు అలా ప్రవర్తించారు. మా గురించి పట్టించుకోలేదు అని అమ్మాయి అనలేదు. మేం చెప్పుగా బోయినా జరిగిందేదో జరిగింది అవన్నీ ఇప్పుడెందుకమ్మా! అందే కాని చెప్పనీయలేదు.

మా అల్లుడి గొప్పతనమేమిటో, మా అమ్మాయి అంత అతని గూర్చి చెడుగా చెప్పినా ఎందుకంత సాహసం చేసిందో మాకు క్రమంగా అర్థమవసాగింది. అదే అంటే శంకర్ 'నాదేం లేదు అత్తయ్యగారూ! అందరిలో తల్లి మనసు చూసే తత్వం మీ అమ్మాయిది. ఇలాంటి జీవిత సహచరి దొరకడం నా అదృష్టం' అన్నాడు. ఈ ఒక్క వాక్యం చాలదూ అతగాడి వ్యక్తిత్వమెలాందో తెలుసుకోటానికి!

కన్న పిల్లలు సుఖంగా, ఆనందంగా వుండాలన్న స్వార్థం తప్పితే తనకంటూ ఏమీ కోరుకోని, మిగుల్చుకోని అమృత హృదయం పేరే 'అమ్మ' అని నా కూతురు నిర్వచించింది. అంతేకాదు అవసరమైతే పట్టుదల కూడా విడిచిపెట్టాలని నా అనుభవం నేర్పింది. అది వదిలిపెట్టాక ఇప్పుడే నేను అమ్మనయ్యాను. ★

## యస్..బాస్..! సత్యమూర్తి




(5వ పేజీ తరువాయి)

ఫోన్లు ఇప్పటికే నిషిద్ధం. కాక్‌పిట్‌లోని సమాచార వ్యవస్థను సెల్ తరంగాలు చిందరవందర చేస్తాయి కనుక విమానాలలో సెల్‌ఫోన్లను అనుమతించరు.

**ప్రతి విజయవంతమైన మహిళ వెనుక ఓ 'సెల్'**

సెల్‌ఫోన్లు విపరీతంగా వ్యాప్తి చెంది ధనికుల హస్తభూషణం స్థాయి నుంచి దిగజారిపోయి మహిళలకు ఆభరణాలుగా మారాయని ఒక సర్వే చెపుతోంది.

> మొబైల్ సాయంతో ఏ ప్రాంతంలో ఉన్నదీ వెంటనే తెలుసుకోవచ్చునన్నది ఆధునిక ఆలోచన. ఏ విధంగానైతేనేం మొబైల్ ఫోన్లు తమ అధీనంలోకి రావడాన్ని మహిళలు మహాగర్వంగా చెప్పుకుంటున్నారు.

సెల్‌ఫోన్లు అందరికీ అందుబాటులోకి రావడంతో పురుషుడు తన ప్రతిష్ట, ఆధిక్య ప్రదర్శనకు సెల్‌ను ఆయుధంగా భావించడంలేదు. ఇప్పుడిక మొబైల్ 'ఛార్జి' తగ్గడంతో ఆడవాళ్ళు మొబైల్ వెంటపడుతున్నారు. రకరకాల డిజైన్లలో, రంగులలో సెల్‌ఫోన్లు రావడం మహిళల కోసమేనట. పైగా భయస్థులైన తండ్రులు, భర్తలు తమ తమ కూతుళ్ళకు, భార్యలకు మొబైల్ ఫోన్లు కొనిస్తున్నారు. మొబైల్ సాయంతో ఏ ప్రాంతంలో ఉన్నదీ వెంటనే తెలుసుకోవచ్చునన్నది ఆధునిక ఆలోచన. ఏ విధంగానైతేనేం మొబైల్ ఫోన్లు తమ అధీనంలోకి రావడాన్ని మహిళలు మహాగర్వంగా చెప్పుకుంటున్నారు. తమకు కావల్సిన వారితో ఎక్కడి నుంచైనా మాట్లాడటం, అందరితోనూ మాట్లాడటమే కాక టెక్స్ట్ మెసేజ్‌లో పంపడం. ఇంటర్‌నెట్ స్నేహాలు చేయడం వంటి అభ్యుదయ కార్యక్రమాలకు 'సెల్' మహిళలకు ఎంతో సహకరిస్తోంది. అయితే సెల్‌ఫోన్ల వల్ల మహిళలు మరీ లావెక్కి బొజ్జలు పెంచేస్తున్నారని కూడా ఓ సర్వే చెపుతోంది. సెల్ మూలంగా ఆడవాళ్ళ నడక సంవత్సరానికి పదిమైళ్ళు తగ్గిపోతోందిట. తల్లులు తమ యువ కూతుళ్ళకు మొబైల్ ఫోన్లు కొనిచ్చి వారిమీద నిఘా ఉంచడం ద్వారా హాయిగా ఊపిరి పీల్చుకుంటున్నారట.

బోలెడన్ని సుఖాలతోపాటు సవాలక్ష నష్టాలను కూడా మన సొంతం చేస్తున్న అందమైన మహమ్మారి సెల్‌ఫోన్. నిత్యం 'మరణించే' డీఓటీ వ్యవస్థలోని ఫోన్లను నమ్ముకోవడం కంటే ఎంత నష్టం చేసినా ఎన్ని జబ్బులను మోసుకొచ్చినా సెల్ మీద ఆధారపడటమే మేలంటున్నారు పురుషులు, స్త్రీలు ఏకకంఠంతే.

ఇక అమ్మాయిలు అబ్బాయిలైతే సరేసరి. 'హసీనా మాన్ జాయెంగీ' సినిమాలో గోవిందా పాడిన 'వాటీజ్ యువర్ మొబైల్ నంబర్, వాటీజ్ యువర్ స్టైల్ నంబర్' పాట కుర్రకారును ఓ ఊపు ఊపడానికి కారణం యువతలో సెల్‌పై ఉన్న మోజే. యువత భాషలో సెల్‌ఫోనంటే 'హైటెక్ మన్మథుడు' ప్రేమ కబుర్లను మాటల రూపంలోనే కాక అక్షరాల రూపంలో కూడా పంపే శృంగార దేవుడు సెల్‌ఫోన్. ఇప్పుడు సెల్‌ఫోన్లు టెక్స్ట్ మెసేజ్‌లను కూడా పంపుతున్నాయి. ఆఫీసులో బోర్‌గా పనిచేస్తున్నప్పుడు ప్రియుడి నుంచో ప్రియురాలి నుంచో వచ్చిన 'ఐ లవ్ యూ' సందేశం సెల్‌ఫోన్‌లో కదులుతుంటే ఎంతో అద్భుతంగా ఉంటుందంటున్నారు కుర్రకారు. ఇక ప్రేమలేఖలు లేనే లేవు. ఫోన్లు ప్రేమ సందేశాలను హత్య చేశాయి అని ఇంతకాలం వాపోయిన వాళ్ళకు టెక్స్ట్ మెసేజ్‌లు ఓ ఊరట. ఇక సెల్ లేఖలు పుంఖానుపుంఖాలుగా రాసుకోవచ్చన్నమాట.

సెల్‌ఫోన్ జబ్బులను మోసుకొస్తుంది నిజమే కానీ కాలాన్ని బోలెడంత ఆదా చేస్తుంది... నేరాలను పెంచుతోంది నిజమే కానీ ప్రేమనూ ఆత్మీయతను రాగాలనూ మేఘ సందేశాలు చేస్తుంది. అవినీతికి తోడ్పడుతోంది నిజమే కానీ గొప్ప అనుభూతులనూ అందిస్తుంది. అందుకే సెల్‌ఫోన్ ఓ 'అందాల రాచ్చసి'

–శశాంక